క్లుప్తంగా

నేడు వలంటీర్ల ధర్నా

పిడుగురాళ్ల: పట్టణంలో గురువారం వలంటీర్ల ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వలంటీర్ల సంఘం ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ, మండలంలోని వలంటీర్లందరు పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు బాషా పాల్గొంటారన్నారు. ఐలాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ కార్యాలయం వరకు వెళ్లి మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లుందరు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

లాయల్ లేమేన్సి చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



విజయపురిసౌత్: ఏసుక్రీస్తు లోక రక్షకుడని, సకల మానవాళి పాప విమోచనకు ప్రాణం ఇవ్వడానికి లోకానికి వచ్చాడని, జ్ఞానుల వలె విలువైన హృదయం దేవునికి కానుకగా ఇవ్వాలని రెవరెండు పాస్టర్ కొండ డేనియల్ శ్యాంబాబు అన్నారు. బుధవారం స్థానిక లాయల్ లేమేన్సి ఇవాంజలికల్ ఫెలోషిప్ చర్చిలో మానవ సేవ సమితి అధ్యక్షుడు పలుకూరి జోసెఫ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. పాస్టర్ డేనియల్ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ, ఏసుక్రీస్తు సందేశం, క్రైస్తవంలో భాగమని, ఏసు చూపిన బాటలో నడవాలని అన్నారు. అనంతరం ఆదరణ మానవ సేవ సమితి అధ్యక్షులు పలుకూరి జోసెఫ్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు జయరావు, కోటేశ్వర రావు, చార్లెస్ స్కాట్, కే కోటేశ్వరరావు, నీలం రఘు, జి.తిమోటి, ఎం.మోహన్, బీర్నిడి కుమార్, ఎం.రవి, వీరారెడ్డి, శివకుమార్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగతనం

పిడుగురాళ్ల: పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాల మేరకు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి లుంగీపై వచ్చి ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న మూడు ఉంగరాలు, ఒక నాంతాడు సుమారు 10 సవర్ల బంగారుతో పాటు రెండు వెండి పట్టీలు, సుమారు రూ.40 వేల నగదును దొంగలించాడని వాపోయింది. లుంగీ కట్టుకొని వచ్చిన వ్యక్తి ప్రధాన వీధిలోని సీసీ ఫుటేజిలో కనిపించినట్లు ఆ వ్యక్తి దొంగతనం చేసినట్లు ఆమె తెలిపింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.
ఎంఈఓ రవికుమార్

కమ్యూనిస్టు నాయకుడు సాంబశివరావు మృతి



మాచర్ల రూరల్: పట్టణానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు, కేసీపీ సిమెంట్స్ మాజీ ఉద్యోగి రామినేని సాంబశివరావు (82) అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్ సాంబశివరావు సీపీఎం పార్టీ నాయకుడిగా కేసీపీ సిమెంట్స్‌లో ఉద్యోగం చేస్తూ కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో పోరాటం చేస్తూ వారి వైఖరికి నిరసనగా ఉద్యోగానికి రాజీనామా చేసి మావోయిస్టు పార్టీ సానుభూతి పరుడిగా, రాడికల్, రైతు కూలీ సంఘం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాడు. ఈయన నేతృత్వంలో విరసం రాష్ట్ర స్థాయి మహాసభలు పట్టణంలో నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు అజయ్, నక్సల్ కుమార్, కుమార్తె శాంతిలున్నారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు గుర్తుగా ఒక కుమారుడికి నక్సల్‌కుమార్ అనే పేరు పెట్టాడు. ఈయన మృతి పట్ల పలు ప్రజా సంఘాల, కమ్యూనిస్టు పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

చిన్నారుల ఈత సరదా



పిడుగురాళ్ల: ఆహ్లాదం కావాలంటే బాల్యంలో చవి చూడాల్సిందే. చెట్టు కొమ్ములపై ఊగుతూ... కాలువ గట్లపై ఆడుకుంటూ... వాగుల్లో, కాలువల్లో ఈత కొడుతూ ఉంటే ఆ సరదానే వేరు... అలాంటి సరదా అనుభవించాలంటే అది ఒక మధ్య తరగతి, పేద కుటుంబానికి చెందిన బాలలకు తెలుస్తుంది. బాల్యంలో అనుభవించిన తీపి గుర్తులు మరలా తిరిగి రావు. పిడుగురాళ్ల పట్టణంలోని జూనియర్ కాలేజీ వద్ద ఉన్న ఎర్రవాగులో కొంత మంది చిన్నారులు సరదాగా ఈత కొడుతూ... కేరింతలు కొడుతూ కనిపించటంతో సాక్షి ఒక్కసారిగా క్లిక్ మనిపించింది.

ప్రభుత్వ భవనాలకు కూటమి గ్రహణం

- నిలిచిన భవన నిర్మాణాలను చేపట్టాలని ప్రజల డిమాండ్
- నేటి వరకు భవన నిర్మాణాలపై దృష్టి పెట్టని కూటమి ప్రభుత్వం
- ప్రజలకు అందుబాటులోకి రాని ప్రభుత్వ సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం గ్రామాలలోనే ప్రజలకు ఇంటి ముంగిటే సేవలన్నీ అందాలని గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదితర వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పల్లెల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు భారీగానే నిధులు విడుదల చేసి ప్రాధాన్యతగా తీసుకుని భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే వివిధ కారణాల వలన కొన్ని పరిపాలనా భవనాల నిర్మాణాలు కొన్ని చోట్ల ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం ఆ భవనాల నిర్మాణాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

దాచేపల్లి : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం చేపట్టిన పరిపాలనా భవనాల నిర్మాణాలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మధ్యలోనే నిలిచిన భవన నిర్మాణాలపై దృష్టి సారించ లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు అందటంలో జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలపై పెట్టిన దృష్టి అభివృద్ధి, సంక్షేమంపై పెట్టడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉన్నట్లయితే భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తయి సేవలు అందుబాటులోకి వచ్చేవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటం వలనే ఈ భవనాలకు గ్రహణం పట్టిందని ప్రజలు భావిస్తున్నారు.

అధికారులపై ఒత్తిడి

కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాలు చేపట్టే వ్యక్తులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే అన్ని వ్యవస్థలను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసిన కూటమి సర్కార్ గత ప్రభుత్వంలో చేపట్టిన పాలనా భవనాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిలిచిన భవనాల నిర్మాణాలు చేపడితే ప్రజల్లో మంచి పేరు గత ప్రభుత్వానికి వస్తుందని చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి అధికారులు బిల్లులు చెల్లించటం లేదు. దీంతో భవన నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సాంకేతిక కారణాల వలన ఆలస్యంగా మంజూరు చేసిన భవనాల నిర్మాణాలు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలపై దృష్టి పెట్టలేదు. దీంతో ప్రజలకు ప్రభుత్వ అధికారులు పూర్తి స్థాయిలో సేవలను అందించలేకపోతున్నారు. అసంపూర్తిగా నిలిచిన భవనాల నిర్మాణాలు తక్షణమే చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పెదగార్లపాడులో నిలిచిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం



మాదినపాడులో నిర్మాణ దశలో ఆగిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం



మాదినపాడులో నిలిచిన హెల్త్ సెంటర్ భవన నిర్మాణం

దాచేపల్లి మండలంలో ఇలా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిపాలనా భవనాలు చకచకా నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. దాచేపల్లి మండల వ్యాప్తంగా 11 గ్రామ సచివాలయ భవనాలు మంజూరు అయితే 10 పూర్తి చేశారు. 5 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా 3 పూర్తి చేశారు. 8 వైఎస్సార్ హెల్త్ సెంటర్లకు 5 పూర్తి చేశారు.

- ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.20.80 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కి రూ.17.05 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. దశల వారీగా బిల్లులు చెల్లించి నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చేశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించటంతో భవన నిర్మాణాలు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మండలంలోని మాదినపాడు, కేసానుపల్లి, పెదగార్లపాడు, ముత్యాలంపాడు, తంగెడ గ్రామాల్లో భవనాల నిర్మాణాలు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు సేవలు అందుబాటులోకి వస్తాయి.

నిర్మాణాలు పూర్తి చేయాలి



దాచేపల్లి మండల వ్యాప్తంగా నిలిచిన సచివాలయం, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి. గత ప్రభుత్వం ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో ఈ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా వివిధ దశల్లో నిలిచిన భవనాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు చేసి చూపించాలి. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆగిన భవన నిర్మాణాలపై దృష్టి సారించి సకాలంలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ జాకీర్‌హుస్సేన్, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్, నారాయణపురం

ప్రజలకు మేలు జరుగుతుంది



పరిపాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఇవి లేకపోవటం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూసి వీటిని మంజూరు చేశారు. ఈ భవనాలు పూర్తి చేయటం వలన ప్రజలకు మేలు జరుగుతుంది. రాజకీయ కారణాలు చూపి వీటి నిర్మాణాలు ఆపేయటం మంచి విధానం కాదు. ఇవి ప్రభుత్వ ఆస్తులు. కాబట్టి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణాలు పూర్తి చేయాలి.

– కాసర్ల నరసింహారెడ్డి, తంగెడ

దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలి

ఎంఈఓ టి.రవికుమార్



కారెంపూడి: స్థానిక భవిత సెంటర్‌లో వరల్డ్ డిజేబుల్డ్ డే ను బుధవారం జరుపుకున్నారు. ఎంఈఓ టి.రవికుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో సముచిత స్థానం కల్పించడంతో పాటు అన్ని రంగాలలో వారు ఎదిగేందుకు ప్రభుత్వాలు అందిస్తున్న అన్ని పథకాలను వారి దరిచేర్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని కోరారు. విద్యార్థులకు ప్రేమతో బోధన చేస్తున్న ఉపాధ్యాయిని ఎస్.మాధవి, ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాసరావు తదితరులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. బహుమతులు అందించారు. ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం బి.మాన్‌సింగ్‌నాయక్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జర్నలిస్టుల పై దాడులు తగవు

మాచర్ల రూరల్: వృత్తిరీత్యా వార్తల సేకరణలో నిరంతరం శ్రమించే జర్నలిస్టులపై అమానుష దాడులు చేయటం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి అన్నారు. జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. నాలుగు గోడల మధ్య ఉన్న సమస్య బయటకు వస్తే అది కచ్చితంగా ప్రజలకు అందించాల్సిన వార్తేనని, సినీనటుడిగా కుటుంబ సభ్యుల తగాదాను రోడ్డు మీదకు తీసుకొచ్చి దానిపై వివరాలడుగుతున్న మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు మైకులు లాక్కొని, బౌన్సర్ల ద్వారా దాడులు చేయటాన్ని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం వాటిల్లేలా మోహన్‌బాబు ప్రయత్నించారని, ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేసి మీడియా ప్రతినిధులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పవిత్రమైన అయ్యప్ప మాలాధారుడిపై కూడా దాడి చేయటం భక్తుల మనోభావాన్ని దెబ్బతీయటమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకట రమణ తెలిపారు. బుధవారం మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు సంబంధించి భూముల సమస్యలలో ప్రధానంగా అడంగల్‌లో పేరు మార్పు 22ఏలో మ్యుటేషన్, ఎల్ఈసీ కార్డులతో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణలు, గట్టు తగాదాలను సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. సంబంధిత రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందిస్తే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ సాంబశివరావు, వీఆర్ఓ చంద్రశేఖర్, కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు ఉన్నారు.



ముత్యాలంపాడు రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రమణ తదితరులు

మాదినపాడు రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు

దాచేపల్లి : మండలంలోని మాదినపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ వైపీ కుటుంబరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు గ్రామాల నుంచి వచ్చిన రైతులు భూ సమస్యలపై 15 అర్జీలను అధికారులకు అందించారు. పొలాల్లో సరిహద్దు రాళ్లు మార్చారని, భూమి కొలతలు వేయాలని, పొలాల మధ్య గట్ల సమస్య, కాలువల సమస్యలు ఉన్నాయని అధికారులకు వివరించారు. రైతుల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కుటుంబరావు చెప్పారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రాజు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాదినపాడులో రెవెన్యూ సదస్సు

నిర్మాణంలో ఉన్న మసీదులో బోరింగు ధ్వంసం

మాచర్ల రూరల్: నిర్మాణంలో ఉన్న మసీదు ప్రాంతంలో బోరు పైపులను కోసి వేసి కరెంట్ ప్యానల్ బోర్డును దొంగిలించి పరిసరాలను అపరిశుభ్రంగా చేసిన ఘటన మండలంలోని జమ్మలమడక గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మసీదు పెద్దలు అబ్దుల్ రజాక్, వహీద్‌లు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో తుమ్మకోట గ్రామానికి వెళ్లే రహదారిలో నిర్మాణంలో ఉన్న మసీదులో బోరింగ్ పైపులను కోసి వేసి మోటర్‌ను నీటిలో పడవేసి ప్యానల్ బోర్డును తీసుకెళ్లటమే కాకుండా ప్రాంగణంలో మద్యం సీసాలు పడవేసి నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. 2002లో పంచాయతీ అధికారులు మసీదు నిర్మాణానికి తీర్మానమిచ్చి స్థలం అందించారని, అయినప్పటికీ ఈ ప్రాంతానికి చెందిన కొందరు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నంలో స్థలంలో అక్రమ చొరబాట్లు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎలాగైనా నిర్మాణాన్ని అడ్డుకోవాలనే ప్రయత్నంలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. రూరల్ ఎస్ఐ నారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించి పూర్తి వివరాలు రాబడుతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



జమ్మలమడకలో బోరింగ్ పైపులను కోసి వేసి, ప్యానల్ బోర్డును దొంగిలించిన ప్రదేశం

భగవద్గీత అందరికీ మార్గదర్శకం

అమరావతి: వ్యాస భగవానుడు అందించిన మహోన్నతమైన జ్ఞానసంపద కలిగిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ ఆచరించి పూజించాలని భవఘ్ని గురూజీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వైకుంఠపురం వేదవ్యాస దేవాలయంలో గీతాజయంతిని పురస్కరించుకుని భగవద్గీతారాధన సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతజీవకోటిని సన్మార్గంలో నడిపించడానికి భగవద్గీత అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేనంత ఆధ్యాత్మిక జ్ఞానసంపదను మహర్షులు మనకు అందించారన్నారు. వేదాలు, ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత అన్నారు. మహోన్నతమైన జ్ఞాన సంపద నిండి ఉన్న భగవద్గీతను రక్షించుకుంటూ నిరంతర పఠనంతో నిజజీవితంలో కూడా అనుసరించి భగవద్గీత గొప్పతనాన్ని సమాజానికి చాటాలన్నారు. తొలుత వేదవ్యాసుని మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగవద్గీత గ్రంథానికి షేక్ సాయిబాబు, షేక్ బేబీ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భవఘ్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, గీతా ప్రేమికులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు

పిడుగురాళ్ల: విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కార్ప్ సంస్థ పిడుగురాళ్ల శాఖ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లోని కార్ప్ సంస్థ స్కూల్‌లో మానవతా దినోత్సవ (హ్యూమానిటీ డే) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్ప్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మంచి విద్యను అందించటం ద్వారానే సమాజంలో సాంఘిక సమానత్వం వస్తుందని తెలిపారు. పాఠశాల హెచ్ఎం అధ్యక్షత వహించారు. జాతీయ దళిత ఉద్యమ యువనేత, మానవతా మూర్తి డాక్టర్ పి.ఫ్రాంక్ విశ్వనాథ్ జన్మదినం పురస్కరించుకొని కార్ప్ సంస్థ డీవోలకు, మరో 30 మందికి జాతీయ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు ఓ.జీవ దయామణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ ప్రచార సేవా సమితి అధ్యక్షులు దేగల అబ్రహాం, పిడుగురాళ్ల ఎమ్మార్పీస్ పట్టణ అధ్యక్షులు రామ ఇజ్రాయేలు, దళిత సేవాదళ్ తాళ్లూరి సురేషచంద్‌లు పాల్గొన్నారు.

భార్యపై సుత్తితో దాడి

చిలకలూరిపేటటౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెపై సుత్తితో దాడిచేయగా తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పసుమర్రు గ్రామానికి చెందిన గుంజి నాగరాజు, గుంజి ఆదిలక్ష్మి దంపతుల మధ్య అనుమానం అనే వివాదంతో చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటలకు ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆవేశంగా నాగరాజు భార్య ఆదిలక్ష్మి తలపై సుత్తితో మోదాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆదిలక్ష్మిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు చేశారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆదిలక్ష్మి కుమారుడు గుంజి నవీన్‌గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాలల సింహగర్జన జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: ఈ నెల 15వ తేదీన ఛలో గుంటూరు కార్యక్రమంలో భాగంగా మాల మహానాడు, మాలల సింహగర్జన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా మాల మహానాడు వైస్ ప్రెసిడెంట్ కొర్రపాటి ఎర్రయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో బుధవారం జేఏసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ మాలల అభివృద్ధి, మాలల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని ప్రతి ఒక్కరు ఈ నెల 15న గుంటూరులో జరగబోయే సింహగర్జన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని సూచించారు. ఎర్రయ్యను మాల నాయకులు ధార చెన్నయ్య, దర్శి శ్యాంబాబు, నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ధార చెన్నయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాశం శ్యాం, దొప్పలపూడి శౌరయ్య, రాజు, రత్నకుమార్, సంఘీతరావు, పోతుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిల్లా మాల మహానాడు వైస్ ప్రెసిడెంట్ ఎర్రయ్యను సన్మానిస్తున్న శ్యాంబాబు

సిరుల బంతి



గోపాలపురం గ్రామం వద్ద సాగు చేసిన బంతి పూల తోట

మాచర్ల రూరల్: లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టాలు చవిచూసే కన్నా బోరుబావుల కింద సాగు చేసిన బంతిపూల తోటలు రైతన్నలకు లాభాలు కురిపిస్తూ వారి ఆశలు చిగురింపజేస్తున్నాయి. మండల పరిధిలోని గోపాలపురం పరిధిలో బంతి పూలతోట సాగు చేస్తున్న వైనం పలువురిని ఆకర్షిస్తుంది. పంట కోత ప్రారంభంలో మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ధర పలుకుతుండటంతో పాటు, పండుగల సమయంలో రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయాలు జరుపుతున్నారు. ఆశించిన రీతిలో పంట దిగుబడితో పాటు ఆదాయాన్నీ పొందుతున్నారు. మండల పరిధిలోని గోపాలపురం, కంభంపాడు, ముత్యాలంపాడు, గన్నవరం గ్రామ శివారుల్లో సుమారు 60 ఎకరాల్లో బంతి పూల పంటను సాగు చేస్తున్నారు. బంతి, చామంతి, గులాబి, మల్లె మేలైన రకాల మొక్కలను రాజమండ్రి నుంచి తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. నాటిన రెండు నెలల్లోనే పూలు కోతకు వస్తాయి. ఎకరాకు నేల స్వభావాన్ని బట్టి 2 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. పంట సాగు కోసం ఎకరాకు రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు ఖర్చు అవుతుందని, పత్తి, మిర్చి ఇతర పంటల కంటే బంతి పూల సాగే లాభదాయకంగా ఉందని రైతులు తెలుపుతున్నారు.

మద్యం బెల్టుషాపులపై దాడులు

నకరికల్లు: మండలంలోని మద్యం బెల్టుషాపులపై దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చల్లా సురేష్ బుధవారం తెలిపారు. కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో దాడులు నిర్వహించగా కుంకలగుంటలో 35 మద్యం బాటిళ్లు, చేజర్లలో 51 మద్యం బాటిళ్లు గుర్తించామన్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం కేసులో టీడీపీ నేత అరెస్ట్

60 మద్యం సీసాలు స్వాధీనం

సత్తెనపల్లి (ముప్పాళ్ళ): సత్తెనపల్లి మండలంలోని భీమవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకుడు వెంకట్రావు అక్రమ మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో మంగళవారం రాత్రి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక బృందం సభ్యులు దాడి చేసి 60 మద్యం సీసాలు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొన్నారు. వెంకట్రావుపై కేసు నమోదు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.